
పవని
నిర్మల
ప్రభావతి

"రాప్...రాప్..."

సుభద్రమ్మ త్రుళ్ళిపడింది. తన ఇంటి లోనిపక్క పోర్షన్‌లో బాడుగకువున్న లెక్చరర్ గోపాల్ భార్య కాంతి. మూడేళ్లు[illegible]రిగా నిండని వాళ్ళ పిల్లాడు కిరణ్‌ను చెంపలదిరేలా కొడుతోంది. కిరణ్‌గాడు కెవ్వుమంటూ ఏడుస్తున్నాడు. ఏడుస్తున్నకొద్దీ రెచ్చిపోయి మరీకొడుతోంది కాంతి.

సుభద్రమ్మ ఇక కూర్చోలేకపోయింది కుర్చీలో. చదువుతోన్న భాగవతం గబు



# భగవాన్ రక్షించు ఈ బిడ్డల్ని

కున్న టీపాయ్‌మీద పెట్టి, తనూ, పక్క పోర్షన్‌కూ మధ్యవున్న తలుపు తాళం తీసి, గబగబా వాళ్ళ బెడ్‌రూంలోకి అడుగెట్టింది.

కిరణ్ చెంపలు ఎర్రగా కాలిపోయాయి. భద్రకాళిలా కాంతి బెడ్‌మీద కూర్చొని వుంది.... హఠాత్తుగా సుభద్రమ్మ ఇలా పర్మిషనా, సంస్కారాలు లేనిదానిలా, మధ్య తలుపు తీసుకుని తన ఇంట్లోకి దూసుకు రావటం, అంతటా బెడ్‌రూంలోకి దూకి నట్లు రావటం, కొత్తగా నచ్చలేదు.

"ఏమిటీ?" అంది కాంతి, సుభద్రమ్మ కేసి, కనుబొమ్మలు చిట్లిస్తూ చూస్తూ.

"కిరణ్ ఎందుకో పెద్దగాఏడుస్తుంటేనూ మన్సు కోపంవచ్చి కొడుతున్నట్లుంటేనూ.. వచ్చేశాను...." అంది సుభద్రమ్మ నవ్వటానికి ప్రయత్నిస్తూ, కిరణ్ దగ్గరగా వెళ్ళి, చేతుల్లోకితీసుకుంటూ. నాలుగురోజులక్రితం ఇలాగే జరిగింది. అయితే ఆ సమయంలో కిరణ్, కాంతి, వాళ్ళ పోర్షన్ వరండాలో వున్నారు. సుభద్రమ్మ అక్కడికక్కడే పరుగెత్తుకు వెళ్ళిందారోజు....

"భలేవారే పిన్నిగారూ! పిల్లాణ్ణి కొట్టుకోక, తిట్టుకోకఎలావుంటాం? వాడికి భయ భక్తులు, క్రమశిక్షణా నేను తల్లిగా, ఎడ్యుకేటెడ్ తల్లిగానేర్పుతుంటున్నాను.... తప్పేమిటి? మీ ఇంట్లో అద్దెకుంటున్నంత మాత్రాన, మా పర్సనల్ విషయాల్లో మీరిలా అనవసరంగా జోక్యం చేసుకోవటం బాగా ఏమీలేదు పిన్నిగారూ! మొన్ననే ఈ విషయం చెబుదామనుకున్నాను. కానీ మీరు పెద్దవారు, అందునా ఎం.ఏ.బిఇడి. పాసై ఓ ఉమెన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా రిటైరైన వారు.... నొచ్చుకుంటారని ఆగాను....కానీ ఈరోజు చూడండి. ఈ గదికి మీవేపు తాళం వుంది.... ఆ వెంటిలేటర్ పూర్తిగా గాజుగ్లాస్‌తో కప్పెయ్యలేదు.... అంచేత మా రూంలోని ప్రతి చిన్నమాటా మీకూ వినిపిస్తోంది కాబోలు....తాళం తీసుకు పరుగెత్తుకు వచ్చేశారు. ఇప్పుడైతే కిరణ్ విషయమనుకోండి. నేనూ, మా శ్రీవారే ఏదో ఓ ప్రణయకలహమో, ప్రళయకలహమో మా ఫామిలీ విషయంలో పెట్టుకొంటాం కోండి.... మీరిలాగే పరుగెత్తుకువస్తే ఏ దారి? ఇదేం సభ్యత?" దులిపేసి, కాం ముఖం, మెడా తుడుచుకుంది ప కొంగుతో....


సుభద్రమ్మ నిర్ఘాంతపోయింది. ఇం మాట పడటం ఆమెకు చాలా బాధ కలి చింది. ఇద్దరు కొడుకులు, ఇద్దరు కోడ ఓ కూతురు, ఓ అల్లుడూ, వారి పిల్ల దూరదూర ప్రదేశాలలో ఉద్యోగాల వున్నారు. శలవుల్లో అందరూ వస్తారు తను తనభర్త వాళ్ళదగ్గరికేవెళ్ళవస్తుంటార ఏనాడూ వాళ్ళ వ్యక్తిగత జీవితాల్లో అన సర జోక్యం కల్పించుకోలేదు తా అందుకేవాళ్ళకూ తామంటే ఎంతోగౌరవం కానీ, ఈ కాంతి ఎంతమాటంది? వా బెడ్‌రూంలోకి తాను, సమయం, సందర్భ లేకుండా దూకి వచ్చేస్తుందా? ఛ....ఛ...

సుభద్రమ్మకూ కోపం వచ్చింది. "అనవలసిన నాలుగు మాటలూ అనేశావు. మంచిది కాంతీ! కానీ కిరణ్‌నిలాకొట్టడ ఓ తల్లిగా ఓర్పుగా సహించలేకపరుగెత్తు వచ్చానంతేనమ్మా! పసివెధవ! తల్లికోప వస్తే అమ్మమ్మలాంటినేనుదగ్గరకుతీస్తానని"

కాంతి ఛర్రుమంది "ఆరునెలలైంది మీ ఇంట్లోచేరి, పసివెధవంటూ తెగ ముద్దు చేసి, వాణ్ణి వెధవని చేసేశారు. వాడూ నా మాట ఖాతరుచేయని స్థితికి తెచ్చేశారు. మీ మనవళ్ళనీ, మనవరాళ్ళనీ ఇలాగే పాడు చేసుకుంటారా? మూడోఏడు రాబోతోంది వెధవకి! ఏబిసిడిలు పలకమంటే పలకడే!"

సుభద్రమ్మ ఫక్కున నవ్వింది. ఆమె కోపం ఎగిరిపోయింది. "మూడేళ్ళయినా రాలేదు వాటికి. "కల్ల" అంటున్నాడు "కర్ర"ని. పిర్రమీద ఇంజక్షన్ చేస్తే "పిల్లి ఉవ్ అమ్మమ్మా!" అంటున్నాడు....ముద్దు మాటలుతప్ప, మాటలైనా ఇంకా స్పష్టంగా రాని వాడికప్పుడే ఏ.బి.సి.డి.లు, క్రమశిక్షణా ఏమిటమ్మా కాంతీ! నా మనవళ్ళకీ మనవరాళ్ళకీ ఐదేళ్ళునిండాకేఅక్షరాభ్యాసం, బడికి పంపటం చేయించాను.... ఆపరికి ఊహ వస్తుంది వాళ్ళకి.... నేర్చుకోవాలన్న కుతూహలమూ, జ్ఞానమూ వస్తాయి. నిప్పు ముట్టుకుంటే కాలుతుందనీ, నీళ్ళబకెట్లో పడితే మునిగిపోతామని తెలియని వయసు కిరణ్‌గాడిది. కుక్కనూ, పిల్లినీ, బల్లినీ, తేలునీ, తోకపట్టుకు లాగుదామనే అల్లరి వయసేగానీ, అవి తిరగబడి కరుస్తాయనీ కుడతాయనీ తెలీని పసిమనసు....వాడి బుల్లి మెదడులో ఏ.బి.సి.డీలు ఎక్కించాలనే తాపత్రయం ఏమిటి? ఐదో ఏడైనారానీ వాడికి.... అలాగేనేర్పుదువుగానీ, స్కూలుకి పంపేద్దువుగానీ...." అంటూనే, కిరణ్ గాడిని చంకనేసుకుని తను పోర్షన్‌లోకొచ్చి తాళం పెట్టేసింది.... వాడి బుగ్గలు నిమిరి, ముఖంనీళ్ళతో కడిగి, పౌడర్ పూసి, చాక్లెట్లు పెట్టింది.... కబుర్లు చెబుతూ, ఆమెఒడిలోనే నిద్రపోయాడు వాడు. వరండాలోకి వెళ్ళి, కాంతిని కేకేసింది, "కిరణ్ నిద్రపోయాడు కాంతీ! తీసికెళ్ళమ్మా!" అంది.

కాంతి కోపంగాబయటకొచ్చి, మౌనంగా వాణ్ణితీసుకుపోయి పడుకోబెట్టుకుంది. అప్పుడే అటు గోపాల్, ఇటు సుభద్రమ్మ భర్త రాఘవరావుగారూ వచ్చారు.... అటువేపు పోర్షన్‌లో కాంతి, గోపాల్‌తో సాయంత్రం జరిగిన సంఘటన కోపంగా చెబుతుంటే, ఇటువేపు భర్తతో కిరణ్‌గాడి ముద్దుమాటలు




అల్లరి గురించి చెప్పి, చెప్పి మురిసి పోతోంది.

రిటైర్డు జడ్జిగా, జీవితానుభవాల పాఠాలు ఎన్నోచవిచూచిన రాఘవరావుగారు మాత్రం అన్నీ విని నవ్వారు. "కిరణ్ మీద అంత మమకారంపెంచుకోకు సుభద్రా! వాడువాళ్ల పిల్లాడు. త్వరలోనే వీకూ! శాంతికీ పెద్ద తగవుజరిగినా ఆశ్చర్యంలేదు.... మనస్వంత బిడ్డల విషయంలోనే మనం తటస్థంగా వుంటున్నాం...." అన్నారు. సుభద్రమ్మ ఏమీ మాట్లాడలేదు క్షణకాలం.

పెద్ద ఇంట్లో తామిద్దరూ వుండలేక, తోడుగానూ, పలుకూ తోడూగానూవుంటారని, నాలుగుగదులుఓపోర్షన్‌గా మార్చి, అద్దెకిచ్చారు సుభద్రమ్మ రాఘవ రావుగార్లు. గోపాల్, శాంతి,కిరణ్ పాపం అద్దెకు దిగినరోజు చాలా సంతోషించారు. గోపాల్ బ్యాంక్‌లో క్యాషియర్. శాంతి గ్రాడ్యుయేట్, శాంతి ఉద్యోగం చేయటం గోపాల్‌కిష్టం లేదుట, ఇంట్లో గ్యాస్‌స్టౌ, కుక్కర్, మిక్సీలాంటి అధునాతనమైన పరికరాలు, స్టేటస్ సింబల్ అయిన టి.వి. వున్నాయి. మూడేళ్ళనిండని కిరణ్, ఐదు నెలల పాపను చూచుకొంటూ శాంతి ఇంటి పట్టునవుంటుంది. పాప ఇప్పుడిప్పుడే బోర్లా పడిపోతుతోంది. శాంతి ఆపరేషన్‌చేయించు కుంది. కిరణ్‌తో సుభద్రమ్మకు బాగా కాలక్షేపం అయిపోతోంది. వాడూ "అమ్మమ్మా" అంటూ వచ్చిరాని కబుర్లు చెబుతూ, ఆమె పెట్టే చాక్లెట్లూ, మరమరాలూ, తింటూ ఒక్కోరోజు సుభద్రమ్మదగ్గరేనిద్రపోతాడు.

పిల్లల బాధ్యతలన్నీ తీరిపోయి, వాళ్ళంతా దూరంగా వెళ్ళిపోవటం, వారి జీవితాలలో వారు స్థిరపడటం, తామిద్దరూ రిటైర్ అయి విశ్రాంతిగా వుండటంతో, ఏర్పడిన ఒకానొక ఖాళీ, శూన్యం, ఏకాంతంలో తమ ఇంట్లో ఓ చిన్న దంపతులు, ముద్దులొలికే ఇద్దరు బిడ్డలు రావటంతో, ఎంతో హాయిగా వుంది ముఖ్యంగా సుభద్రమ్మకు. రాఘవ రావుగారు మాత్రం, పగలంతా ఏవో సాంస్కృతిక సంఘాలు, సమావేశాలు, వాటి తాలూకు వ్యక్తులతో గడిపేస్తారు. ఎక్కువగా ఇంటిపట్టునవుండరు. సాయంత్రం క్లబ్బుకువెళ్ళి చదరంగం ఆడతారు. ఇంటికొచ్చి, విశ్రాంతి తీసుకుంటారు....

మర్నాడు సాయంత్రం అదే తంతు జరిగింది మళ్ళీ.... ఈమారు గోపాల్ ఇంట్లో వున్నాడు. సుభద్రమ్మ కిరణ్‌ను తీసుకు రావటానికి పరుగెత్తింది....

"మీరూరుకోండి అత్తయ్యగారూ! వాడికీ వయసులో నేర్పకపోతే ఎలా? ఎల్.కె.జిలో వేసెయ్యాలి వాణ్ణి!" అన్నాడు చిరాగ్గా.

"వాణ్ణి! ఎల్.కెజిలోనా? అప్పుడే?" సుభద్రమ్మ నిర్ఘాంతపోతూ అంది. "వాడికింకా, వాడి అన్నం వాడు సరిగా నోట్లో పెట్టుకొనే వూహరాలేదు! వాడి నా కాన్వెంటుకు తోసేస్తే,వాడికి అన్నం,నిద్రా...?" అంది ఆందోళనగా మళ్ళీ!

శాంతి చిరాగ్గా అంది"మీకా ఆందోళన అవసరంలేదు పిన్నిగారూ! అక్కడమంచి ఆయాలుంటారు- ఇలాంటి పిల్లలందరికీ వాళ్లే టిఫిన్ బాక్సులు తీసి అన్నంపెట్టి, నిద్రపుచ్చి, మళ్ళీ కాన్వెంటురిక్షాలలో తెచ్చి ఇంటివద్దవదులుతారు. వగంపీడా వదుల్తుంది ఇంటిదగ్గర వీళ్ళ అల్లరి లేకుండా!"

"వాడి బుల్లి మెదడులో జ్ఞాపకశక్తి అప్పుడే రాదమ్మా! బలవంతంగా వాళ్ళని హింసపెడితే మెదడు చెడిపోతుంది!" అందామె! పిల్లలలో అపరిపక్వ మెదళ్ళ వాళ్ళూ, అతిపిరికివారూ, తలితండ్రుల్ని టీచర్లనీచూడగానే యమభటుల్ని చూచినట్లు కంపించి పోయేవారూ, పిచ్చిపట్టిపోతున్న వారూ అయిన పిల్లలెందరో గుర్తొచ్చారు. ఈ అతిక్రమశిక్షణ, వయసు రాకముందే వారికి పాఠాలు మెదడులోకి చొప్పించి- మాతృభాష కంటేముందు ఇగ్లీషులో వాళ్ళు మాట్లాడాలన్న తపన.... ఆధునిక తలితండ్రులలో పెరగటమే, ఈ విష పరిణామం అని ఆమెకు తెల్సు.

"భలేవారే అత్తయ్యగారూ! మెదడు చెడదు. ఏంకాదు. వాడికిప్పట్నుంచీ శిక్షణ ఇవ్వకపోతే తప్పు, వాడు ఐ.ఏ.ఎస్. ఆఫీసరు కాలేడు! శాంతీ! కిరణ్ కి ఆల్ఫా బెట్స్ నేర్పు. నేసలా బయటికి వెళ్లొస్తా!" అంటూనే వెళ్ళిపోయాడు గోపాల్. "ఇక మీరు వెళ్లొచ్చు" అన్నట్లు సుభద్రమ్మ కేసి చూసి....

వెయ్యి మందిలోనో, ఐదువేలమంది లోనో, ఒకడే ఐ.ఏ.ఎస్ ఆఫీసరౌతున్నాడు ఇలా బిడ్డల్ని చిత్రహింసపెట్టి చదివిస్తే, ప్రతిఒక్కడూ కలెక్టరౌతాడా? డాక్టరు, ఇంజనీరు....అవుతాడా? బిడ్డల వయసు, వారి మేధ, అభిరుచితో అవసరంలేదా ఈ తలితండ్రులకి.

శాంతి గర్వంగా చూస్తూ అంది. మా తోడికోడలి కొడుకు, వీడంతవాడే, ఎల్.కె.జి.లో చేర్చేశారు. వాణ్ణి ఐ.ఏ.ఎస్.కు

పంతులుగారి పెద్దయితే. మాకు మాత్రం ఏం తక్కువ? మేం చదువుకున్న తలితండ్రులం కాదా? మా వాణ్ణి కలెక్టర్‌ను చేస్తాం."

సుభద్రమ్మకు తల తిరిగినట్లయింది. పిల్లాడిమీది పంతమా? తోడికోడలిమీద పంతమా? ఈ పోటీ, ఈ స్పర్ధకు పిల్లలు బలికావలిసిందేనా? పక్కింటివారితో, పై ఇంటివారితో, ఆడబడుచులతో, తోడికోడళ్ళతో పోటీ పడేందుకు ఈ పసిబిడ్డలే ఆయుధాలా? వారి బుల్లి మెదళ్ళు, జీవితాలే సాధనాలా?

పదిహేను రోజులు గడిచిపోయాయి. సుభద్రమ్మ ఎక్కువగా కిరణ్‌గాడి విషయం పట్టించుకోలేదు.... కానీ ఆ సాయంత్రం వాడు ఏ.బి.సి.డి.లు తప్పుగా చెప్పాడని, శాంతి,గోపాల్ కూడా చావగొడ్తుంటే ఎల్.కె.జి.లో వాడికి సీటు రాదేమోనని ఆందోళనతో మరీ కొడుతుంటే, ఇక ఆపుకోలేక పరుగెత్తుకు వెళ్ళింది. కిరణ్‌ను లాక్కుంది. అపరికే వాడి బుగ్గలు, వీపు దెబ్బలతో వాచిపోయాయి. తొడ కందిపోయింది తొడపాశాలతో. తల బొప్పికట్టినట్లయింది మొట్టికాయలతో.

"ఛ....మీరు తలితండ్రులా? ఇలాగ వాణ్ణి చంపేది?" అని హిస్టీరిక్‌గా అరిచింది సుభద్రమ్మ....

శాంతి ఇంకా పెద్దగా అరిచింది. "మీకనవసరం. రేపే మీ ఇల్లు ఖాళీచేస్తున్నాం. వేరే ఇంటిలో చేరుతాం...."

సుభద్రమ్మ నిర్విణ్ణురాలైంది. కిరణ్‌ను లాక్కుంది శాంతి. ఆ రాత్రి సుభద్రమ్మ కనులు నిద్రపట్టలేదు. రాఘవరావుగారు కోప్పడ్డారు. "చెబితే విన్నావుకాదు....ఇల్లు ఖాళీ చేస్తారటనా! పీడాపోయింది. నీకు మెంటల్ టెన్షన్, టార్చర్ తగ్గుతాయి. సుభద్రా! ఈనాటి పగటు ఎడ్యుకేటెడ్ తలితండ్రులమన తత్వాలు ఇలాగే ఉన్నాయి స్వంత బిడ్డల విషయంలో! శాంతికి పాతికేళ్ళకు పెళ్ళయింది. ఆమెకు ఇద్దరుబిడ్డలు చాలనుకుంది....తనలా అతి పరిణితిచెందిన మనసే పిల్లలకూ వుంటుందనుకుంటారిలాటి తల్లులు. పైగా యాంత్రికయుగం. పోటీ ప్రపంచం. ప్రతి చిన్న విషయం పోరాటమే. పిల్లలు త్వర త్వరగా డిగ్రీలు తెచ్చుకోవాలి. ఈజీ మనీ సాధించాలి. ప్రపంచంలో అందరికంటే గొప్పగా తమ పిల్లలే బ్రతకాలి. ఈపోటీ పరుగు ఇలాటి తలితండ్రుల ఇంగితాల్ని మింగేస్తోంది.... పాపం బలిపశువులా పిల్లలు. భావి భారత పౌరులు. ఇంటిలో ఈ తలితండ్రులు, స్కూల్లో ఆ టీచర్లు వేధింపుతో, మతి మరుపు వెధవలుగా, పిచ్చిపిల్లలుగా.... సమస్య పిల్లలుగా తయారౌతున్నారు. మనిద్దరం చేయగలిగిందేమీ లేదు. కాల ప్రవాహానికి ఎదురీదే వయసూ, పరిస్థితులూ కూడా కావు మనవి. మనమనవాళ్ళు, మనవరాళ్లు కూడా ఇదే వరవడిలో త్రోయబడినవారే. పడుకో. నిద్రపో!" అన్నారాయనగారు.

మర్నాడు బాగా జ్వరం వచ్చి కిరణ్‌ని హాస్పిటల్‌లో చేర్పించారు. అసరికే, ఇల్లు ఖాళీచేసి, ఆ వీధిలోనే చివరగావున్న మేడ మీది పోర్షన్‌లో చేరిపోయారు గోపాల్, శాంతి....

మూడు రోజులు జ్వరం తగిలి, నాలుగో రోజు చనిపోయాడు కిరణ్.

అది విన్న సుభద్రమ్మ నెర్వస్ అయిపోయింది....

"కిరణ్ చనిపోలేదు....చంపివేయబడ్డాడీ నాగరికత సంధి యుగంలో" అందామె ఏడుస్తూ రాఘవరావుగారితో.

ఆయనగారికీ కన్నీళ్ళు వచ్చాయి.

మర్నాడు మానవత్వంతో, గోపాల్, శాంతిని ఓదార్చటానికివెళ్ళింది సుభద్రమ్మ.

కోపంగా ఆమెవేపు చూచి, బిగుసు కూర్చున్నారిద్దరూ. కాసేపు ఏదో వేదాంతం మాటలు చెప్పి, వచ్చేముందు పాపకేసి చూసింది సుభద్రమ్మ....పాప బోసినవ్వుల వెన్నెల కురిపిస్తూ పాకుతోంది....పాపను ఎత్తుకుంది....

"ఈబిడ్డనైనా....ఐదేళ్ళునిండే దాకా స్కూల్లో వేయండి. నాలుగేళ్ళు నిండాక ఊహ తెలిశాక, చదువు మొదలెట్టండి...." అందామనుకుంది, కానీ అనేధైర్యంలేదు. శాంతి, గోపాల్ ఇద్దరూ పట్టుదలగా, కోపంగా చూస్తున్నారామెవేపు.

"కిరణ్ చచ్చినా....సరే, మా పాపను మేం.... మూడోఏడురాకముందే, అక్షరాలు రుద్దుతాం. క్రమశిక్షణనేర్పుతాం! మాతోడికోడలి బిడ్డకంటే, మా ఆడపడుచుల బిడ్డలకంటే, మా పక్కింటివారి, ఎదురింటివారి అందరి బిడ్డలకంటే మా బిడ్డే, గొప్పగా ఇంగ్లీషు అక్షరాలు అప్పచెప్పాలి! ఆ క్రమశిక్షణలో ఆబిడ్డ మెదడు చెడనీ, మేధ వికసించక ఆగిపోనీ- మరణించనీ, మా ప్రయత్నంమాదే.... మీ సలహా అవసరం లేదు!" అనే ఘాటు జవాబు వున్నట్లు తోచింది.

పాపనువదిలి ఇంటికివచ్చిన సుభద్రమ్మ నిస్సహాయంగా కూర్చుండిపోయింది. "భగవాన్! రక్షించు ఈతరం పసిబిడ్డల్ని! ఈ వెర్రి అనుకరణల్నుంచీ, వెర్రిపోటీలనుంచీ వెర్రినాగరికతలనుంచీ.... వెర్రి ప్రలోభాలనుంచీ....!" అనుకుంది పదేపదే! ఆమె కళ్ళనుండి ధారాపాతంగా కన్నీళ్ళు ప్రవహిస్తున్నాయి.... అవి ఈనాగరికతా ఎడారిలో పడి ఇంకిపోతున్నాయేమో!

*

